



జై భవానీ.. జైజై భవానీ

దుర్గమ్మ నామస్మరణతో ఉప్పొంగిన ఇంద్రకీలాద్రి

6

- భారీగా భవానీ భక్తుల రాక
- ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి పరిసరాలు
- కిక్కిరిసిన క్యూలైన్లు, స్నానఘాట్లు

జై భవానీ.. జైజై భవానీ నామస్మరణతో ఇంద్రకీలాద్రి మార్మోగింది. ఆదివారం కావడంతో భవానీ దీక్షల విరమణకు రెండు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సాయంత్రం నాటికి సుమారు 75 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భవానీలు తొలుత కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం గిరిప్రదక్షిణ చేసి, క్యూలైన్లలో వెళ్లి అమ్మవారిని దర్శించుకుని, మహామండపం వద్ద ఏర్పాటు చేసిన హోమగుండాల్లో పూజాద్రవ్యాలు సమర్పించి, అనంతరం దీక్ష విరమిస్తున్నారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు ఎరుపెక్కాయి. స్నానఘాట్లు, లడ్డూ ప్రసాదాలు, తలనీలాల వద్ద రద్దీ ఎక్కువగా కనిపించింది.



హోమగుండాల్లో పూజా ద్రవ్యాలను సమర్పించి దీక్ష విరమిస్తున్న భవానీలు



నేడు జిల్లాలో పవన్ పర్యటన



కంకిపాడు/గుడివాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం కృష్ణాజిల్లాలో పర్యటించనున్నట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. కంకిపాడు, రొయ్యూరు వయా గొడవర్రు ప్రధాన రహదారి అభివృద్ధికి డిప్యూటీ సీఎం రూ.3 కోట్లు మంజూరు చేశారని, వాటి పనులను పరిశీలించేందుకు రానున్నట్టు జనసేన పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు ముప్పా రాజా ఆదివారం తెలిపారు. మధ్నాహ్నం 12గంటలకు గుడివాడలోని మల్లాయిపాలెం పర్యటించి గ్రామ రక్షిత మంచినీటి పథకం పనితీరును పరిశీలించనున్నట్టు ఆ పార్టీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తెలిపారు.

సీ క్లాస్ భూముల అర్థం మార్చేశారే..!



దేవరపల్లి నదీపాయలో సర్వే చేసిన గుర్తు ఇసుకలో సర్వే జెండా కట్టిన అధికారులు

దేవరపల్లిలో విస్తుగొల్పుతున్న అధికారుల సర్వే

- ఎస్సీ సొసైటీలో బుసక కోసం దరఖాస్తు
- నదీపాయలో ఇసుక కోసం సర్వే
- ఇసుక తీసి పంటలు పండిస్తారా..!
- ఎవరి కోసం తప్పుడు చర్యలంటూ ఆరోపణలు

సీ క్లాస్ లంక భూములకు అధికారులు అర్థాన్నే మార్చేశారు. బుసక అనుమతులకు దరఖాస్తు వస్తే ఏకంగా ఇసుక లబ్ధి చేకూరేలా చేసిన సర్వే దేవరపల్లిలో ఇప్పుడు చర్చనీయాంశమైంది. బలమైన వ్యక్తుల ఒత్తిళ్లకు, ముడుపులకు తలొగ్గిన అధికారులు జీవో నెం.59కు విరుద్ధంగా పని చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఎస్సీ సొసైటీ భూములు ఇవేనంటూ చూపిస్తున్న కోటేశ్వరరావు

తోట్లవల్లూరు, ఆంధ్రజ్యోతి: మండలం దేవరపల్లి లంకల్లో సర్వే నెం.190లో 148 మంది దళితులకు ప్రభుత్వం 42ఎకరాలు ఇచ్చింది. ఈ భూములు సీ క్లాస్ కిందకు వస్తాయి. గత ప్రభుత్వంలో లీజు పట్టాలను కూడా ఇచ్చింది. ఇందులో సగవ భూమిలో పంటలు పండించుకుంటుండగా మిగతాసగం భూమిలో మీటరు ఎత్తున బుసక వేసి దట్టంగా రెల్లి పెరిగింది. అయినా కొందరు సొంతంగా బుసకను చదును చేసుకుంటున్నారు. అయితే సీ క్లాస్ లంక భూమిపై ప్రైవేటు వ్యక్తుల కన్ను పడింది. 2 నెలల క్రితం మచిలీపట్నానికి చెందిన ఓ వ్యక్తి దేవరపల్లి సొసైటీ భూముల్లో బుసక తవ్వకాల అనుమతుల కోసం జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. మండలానికి చెందిన ఓ వైసీపీ నేత ద్వారా సొసైటీ సభ్యులకు ముందుగానే తలో రూ.వెయ్యి ఇచ్చి అనుమతులు వచ్చాక మళ్లీ ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారు. అయితే దేవరపల్లి బాబూరావు, పెదపూడి కోటేశ్వరరావు అనే ఇద్దరు సభ్యులు బుసక తవ్వకాలను వ్యతిరేకించి అధికారులకు ఫిర్యాదు చేశారు. నవంబర్ 15న తోట్లవల్లూరులో తహసీల్దార్‌ను కలిసి స్వయంగా అర్జీ అందించి బుసక తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని కోరారు. జీవో 59 ప్రకారం ఇవి సీ క్లాస్ భూముల కిందకు వస్తాయని, అనుమతి ఇవ్వబోమని తహసీల్దార్ కుసుమకుమారి మీడియా ముందు హామీ ఇచ్చారు. నెల తర్వాత డిసెంబర్ 17న తహసీల్దార్ సహా మైనింగ్, ఇరిగేషన్, భూగర్భ జలశాఖ, వ్యవసాయశాఖ అధికారుల బృందం దేవరపల్లి లంక వచ్చి బుసక తవ్వకాల కోసం భూమి గుర్తించేందుకు సర్వే చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధమని ఆరోపణలు వస్తున్నాయి. మచిలీపట్నంకు చెందిన స్వామి అనే వ్యక్తి దేవరపల్లి ఎస్సీ సొసైటీ భూముల్లో బుసక తవ్వకాలకు అనుమతి కోరితే 17న అందుకు విరుద్ధంగా సర్వే చేసి హద్దులు వేసి వచ్చారు. సర్వే తరువాత ఎస్సీ సొసైటీ సభ్యుడైన పెదపూడి కోటేశ్వరరావు విలేకరులను ఎస్సీ సొసైటీ భూముల్లోకి తీసుకెళ్లి వాస్తవ పరిస్థితిని వివరించారు. నదీ పాయకు దగ్గర్లోని తమ భూముల్లో బుసక తవ్వకాలు జరిపితే రాబోవు కాలంలో వరదలకు భూములే ఉండవని, అందుకే మిగతా 6లో..

పరేషన్!

రేషన్ బియ్యం తినేది 25 శాతం మంది.. అమ్మేది 75 శాతం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో సివిల్ సప్లయిస్ అధికారులు నిగ్గు తేల్చిన నిజం
- ఉమ్మడి జిల్లాలో 11 లక్షల కార్డుదారులకు 1,60,321 క్వింటాళ్ల పంపిణీ
- ఇందులో 25 శాతం అంటే 40,080 క్వింటాళ్లు మాత్రమే తినేది..
- మిగిలిన 75 శాతం అంటే 1,20,240 క్వింటాళ్లు దారి మళ్లింపు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో లక్ష వరకు బోగస్ కార్డులు
- రేషన్ మాఫియా నియంత్రణకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు అవసర్యం



ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంలో కేవలం పాతిక శాతం మాత్రమే కార్డుదారులు తింటున్నారు. మిగిలిన 75 శాతం బియ్యాన్ని ఎండీయూ ఆపరేటర్లకు అమ్ముకుంటున్నారు. వారిచ్చే నగదుకు మరింత నగదు కలుపుకొని మార్కెట్లో సన్నబియ్యం కొనుక్కుంటున్నారు. దీని వల్ల కార్డుదారుల నెత్తిన అదనపు భారం పడటంతో పాటు ప్రభుత్వానికి భారీగా నష్టం వస్తోంది. తక్కువ ధరకు పేదల నుంచి బియ్యం కొనుగోలు చేసిన మాఫియాకు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వ్యాపారం సాగుతోంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 11 లక్షల కార్డుదారులకు రూ.64.12 కోట్ల వ్యయంతో 1,60,321 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో 25 శాతం అంటే కేవలం రూ. 16.03 కోట్ల వ్యయం చేసే బియ్యం మాత్రమే పేదలు తింటున్నారు. మిగిలిన రూ.48.09 కోట్ల బియ్యాన్ని కార్డుదారులు తినడంలేదు. ఇందులో కార్డుదారులు అమ్ముకుంటే కేవలం పది శాతం మాత్రమే లబ్ధి పొందుతుండగా.. మిగిలిన 90 శాతం రేషన్ మాఫియా లబ్ధి పొందుతోంది.

తినలేకపోతున్నారు..

రేషన్ బియ్యంలో పోషకాలు ఉన్నప్పటికీ మిగతా 6లో..

ఉపాధి నిధుల్లో అక్రమాలు

- ఊళ్లో లేనివారి పేరుతో జాబ్ కార్డులు
- పనిచేయకున్నా కూలీ డబ్బులు ఖాతాల్లోకి
- వాడపాలెం గ్రామపంచాయతీ ఆడిట్‌లో వెల్లడి
- మాజీ సర్పంచ్ తనయుడే సూత్రధారి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న గ్రామస్థులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: వైసీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన వాడపాలెం మాజీ సర్పంచ్ కుమారుడు అనేక అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మచిలీపట్నం మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ పథకం విభాగంలో పని చేసిన అతడు అక్రమాలకు పాల్పడినట్టు తెలియటంతో అధికారులు ఆయన్ను విధులకు దూరం పెట్టారు. అనంతరం ఆయనకు గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగం ఇచ్చారు. మండలం మారినా పనితీరు మారలేదు. సొంతగ్రామంలో బంధువుల పేరిట జాబ్ కార్డులను సృష్టించి మూడేళ్లుగా లక్షలాది రూపాయలను పక్కదారి పట్టించాడు. నాలుగు రోజులుగా వాడపాలెం గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీల్లో ఈ టెక్నికల్ అసిస్టెంట్ నిర్వాకాలు వెలుగులోకి వచ్చాయి.

అక్రమాలు జరిగాయిలా..

వాడపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్ కుమారుడు రామాంజనేయులు వైసీపీ ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేరాడు. తన సోదరుడు గణేష్ మచిలీపట్నంలో నివాసం ఉంటుండగా వాడపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురంలో ఉపాధిహామీ పథకంలో మేట్‌గా పనిచేస్తున్నట్టు రికార్డుల్లో చూపినట్టు తెలుస్తోంది. అంతేకాక గణేష్ భార్య లావణ్య కూడా ఉపాధి పనులు చేసినట్టు రికార్డుల్లో నమోదు చేశాడు. చిన్నాపురం గ్రామంలోని అంగన్‌వాడీ టీచరు, పీహెచ్‌సీలో నర్సుగా పనిచేస్తున్న ఉద్యోగి, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 90 మందికి పైగా తమ బంధువుల పేరున ఉపాధిహామీ పథకంలో పనిచేసేందుకు జాబ్ కార్డులు సృష్టించినట్టు తెలుస్తోంది. ఇక్కడ ఉపాధిహామీ పనులు మిగతా 6లో..



దుర్గమ్మ దర్శనభాగ్యం..



జై దుర్గా భవానీ..

భక్తులతో పోటెత్తిన కీలాద్రి

- భవానీ నామస్మరణతో పులకించిన ఆలయ ప్రాంగణం.. దీక్షల విరమణలు
- పుణ్య స్నానాలు, అమ్మకరుణ కోసం గిరి ప్రదక్షిణ, ఇరుముడుల సమర్పణ
- దుర్గమ్మను దర్శించుకున్న హోంమంత్రి అనిత, తెలంగాణ మంత్రి సీతక్క



భవానీ దీక్ష విరమణలు



హోంమంత్రి అనితకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దుర్గా భవానీ నామస్మరణతో ఇంద్రకీలాద్రి పులకించింది. గిరి ప్రదక్షిణ ఆసాంతం భవానీ దీక్షధారులు ఇరుముడులు శిరస్సున ధరించి దుర్గా భవానీ.. నామస్మరణతో నగరంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. శనివారం ప్రారంభమైన భవానీ దీక్షల విరమణలు 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెండో రోజైన ఆదివారం కనకదుర్గమ్మవారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పించి దీక్షలను విరమించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అధికార యంత్రాంగం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న హోంమంత్రి అనిత, మంత్రి సీతక్క

కనకదుర్గమ్మను హోంమంత్రి అనిత, తెలంగాణా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కలు ఆదివారం దర్శించుకున్నారు. వారికి సీపీ రాజశేఖర్‌బాబు, ఈవో రామారావు తదితరులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలను ఈవో అందజేశారు.

● సినీనటుడు ఉపేంద్ర, యూఐ చిత్ర బృందం ఆదివారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వారికి వేదాశీస్సులు, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

● సీసీ టీవీలలో భవానీ దీక్ష విరమణల దృశ్యాలను హోంమంత్రి అనిత ఆదివారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు, కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సంకేతాలపై నగర సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు, కలెక్టర్ లక్ష్మీశ,డీసీపీ గౌతమి శాలి వివరించారు. సీసీ టీవీలు, డ్రోన్ విజువల్స్ ద్వారా నిరీక్షణ పాయింట్లతో పాటు పార్కింగ్, క్యూలైన్లు, ఘాట్లు, దర్శనం, ప్రసాదం కౌంటర్లు, హోమ గుండాలు, గిరిప్రదక్షిణ, అన్నప్రసాదం పంపిణీ పాయింట్ల వద్ద రద్దీని, భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. శనివారం రాత్రి వరకు 1960 మంది చిన్నారులకు జియో ట్యాగ్‌లు కట్టినట్టు తెలిపారు.

కనకదుర్గా నగర్‌లో షార్ట్ సర్క్యూట్ తప్పిన ప్రమాదం

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి దిగువన మహామండపంపైపు ఉన్న కనకదుర్గనగర్‌లో ప్రహరీకి తగిలించిన విద్యుల్లతల్లో ఆదివారం షార్ట్ సర్క్యూట్ సంభవించింది. అయితే ఇంజనీరింగ్ విభాగానికి సత్వరమే సమాచారం వెళ్లడంతో వెంటనే స్పందించి ప్రమాదాన్ని నివారించారు.



దుర్గమ్మ సేవలో సినీ నటుడు ఉపేంద్ర



బ్రోచర్ ఆవిష్కరణలో గోకరాజు, నరసరాజు, శ్రీనివాస్ తదితరులు

ఈత పోటీలు విజయవంతం చేయండి

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 12న ఉదయం 6 గంటలకు దుర్గా ఘాట్ నుంచి లోటస్ ఫుడ్‌సిటీ వరకు ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రివర్ క్రాస్ ఈతపోటీలను విజయవంతం చేయాలని అసోసియేషన్ కార్యదర్శి మండపాటి లక్ష్మి నరసరాజు తెలిపారు. పోటీల పోస్టర్‌ను మాజీ ఎంపీ గంగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసరాజు మాట్లాడుతూ, 11 నుంచి 60 సంవత్సరాల పైబడి ఐదు కేటగిరుల్లో పోటీలుంటాయని, ప్రతీ క్యాటగిరిలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. క్రీడాకారుల తమ పేర్లను జనవరి 10 లోగా రిజిస్టర్ చేయించుకోవాలన్నారు.



ఉమ్మడి కృష్ణా క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ చాంప్ కృష్ణా

విజయవాడస్పోర్ట్సు : నగరంలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం డీఎస్ఏ హాల్లో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. మహిళా విభాగంలో 141 మంది తలపడగా, పాయల్ విభాగంలో కృష్ణా జిల్లా ప్రధమ,ద్వితీయ స్థానంలో నిలవగా, ఇప్పి విభాగంలో కృష్ణా ప్రధమస్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనపర్చిన వార్ని ఈ నెల 31 నుంచి జనవరి 3 వరకు కేరళలో జరిగే జాతీయ పోటీలకు పంపుతామని రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు నెర్సు నాగేశ్వరరావు, జీఎస్‌వీ కృష్ణమోహన్‌లు తెలిపారు.

బెజవాడ డీసీఎం రాంబాబుకు విశిష్ట పురస్కారం



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న రాంబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైల్వేలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్-2024ను విజయవాడ డివిజినల్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు అందుకున్నారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేతుల మీదుగా రాంబాబు అవార్డును స్వీకరించారు. విజయవాడ డివిజన్‌కు రాంబాబు సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్‌గా వచ్చినప్పటి నుంచి బెజవాడ రైల్వేను కొత్త పుంతలు తొక్కించారు. ప్రధానంగా సంస్థ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఆయన దోహదపడ్డారు. విజయవాడ రైల్వే డివిజన్‌ను జోన్‌లోనే అత్యధిక ఆదాయాన్ని సాధించేందుకు దోహదపడ్డారు. వరుసగా 2022- 23, 2023- 24 సంవత్సరాలలో రూ. 5 వేల కోట్ల మార్కును దాటించి బెజవాడ డివిజన్ సత్తాను చాటి చెప్పారు. సరకు రవాణాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావటం ద్వారా రికార్డు స్థాయిలో రూ. 4 వేల కోట్ల ఆదాయాన్ని సాధించి పెట్టారు. దేశంలోనే రెండో అతి పెద్ద జంక్షన్‌గా ఉన్న విజయవాడను ఆర్థికంగా బలోపేతం చేసినందుకు రాంబాబుకు సముచిత రీతిన అతి విశిష్ట్ రైల్ సేవా పురస్కార్ - 2024 వరించటం విశేషం.



రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా నగరంలో బీజేపీ శ్రేణుల ధర్నా

వన్‌టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించడం కాంగ్రెస్‌కు అలవాటేనని బీజేపీ నేతలు విమర్శించారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ, ఎస్సీ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత బీజేపీ సంఘటన కార్యదర్శి మధుకర్‌జీ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ కుటుంబం అంబేడ్కర్‌ను ఎప్పుడూ అవమానిస్తూనే ఉందన్నారు. అంబేడ్కర్‌ను మంత్రి పదవి నుంచి రాజీనామా చేయించారన్నారు. ఆయన విగ్రహ ఏర్పాటుకు కూడా వ్యతిరేకించారని గుర్తుచేశారు. జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. ఉప్పలపాటి శ్రీనివాసరాజు, ఎస్సీ మోర్చా నాయకులు యలశిల శ్రీనివాస్, బండికాళి, మతంగి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సీతక్కకు కొండపల్లి బొమ్మ బహుకరిస్తున్న బొర్రా కిరణ్

కాబోయే ప్రధాని రాహుల్ గాంధీనే..

- తెలంగాణ మంత్రి సీతక్క జోస్యం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఈసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని తెలంగాణ మంత్రి సీతక్క అన్నారు. ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లిలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆమెకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రాకిరణ్ ఘనంగా స్వాగతం పలికి కొండపల్లి బొమ్మను బహుకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏపీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నేతృత్వంలో పార్టీకి పూర్వవైభవం వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అహంకారి అమిత్‌షా : రుద్రరాజు

వన్‌టౌన్ : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అహంకారి అని జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పార్లమెంట్ శీతాకాల సమావేశాల క్రమంలో రాజ్యసభలో అమిత్‌షా అంబేడ్కర్ పేరును పదే పదే ప్రస్తావించడం కాంగ్రెస్‌కు ఫ్యాషన్‌గా మారిందని చెప్పడం.. అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడడం.. తగదన్నారు. ప్రతిపక్ష పార్టీలను లోక్‌సభలో ఎదుర్కొనే ధైర్యం లేక బీజేపీ మంత్రులు, నాయకులు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు.

మీడియా, వినోద రంగంలో ఉజ్వల భవిత

- యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- పీఐబీ ఏడీజీ రజీందర్ చౌదరి



యువ సంగమంలో ఉత్తరప్రదేశ్ విద్యార్థులు, అతిథులతో ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో ఏడీజీ రజీందర్ చౌదరి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మీడియా, వినోద రంగం సృజనాత్మక మేధావులకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల పరంగా మహత్తరమైన భవిష్యత్తు ఇవ్వగలదని ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో విజయవాడ అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) రజీందర్ చౌదరి తెలిపారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'యువ సంగమం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు న్యూఢిల్లీలో జరగనున్న వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్-2025 యువతకు విశేష అవకాశాలను కల్పిస్తుందన్నారు.

ప్రపంచవ్యాప్తంగా 2.60 ట్రిలియన్ డాలర్ల విలువైన వినోద రంగంలో కొత్త హద్దులను అన్వేషించడానికి ఇది వేదికగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమ్మిట్‌లో వివిధ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు, యువవృత్తిపరులు ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. ఎస్‌పీఏ విజయవాడ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ అయన్ కె.తరాఫ్దర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం యువతకు పరస్పర సంస్కృతులపై అవగాహన కలిగించడం, జాతీయ సమైక్యతా భావాన్ని, దేశంలోని వివిధ ప్రాంతాల జీవన విధానాలను తెలుసుకొనే దిశగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. యువ సంగమంలో పాల్గొన్న యువతకు కొండపల్లి కళాకృతులతో కూడిన స్మారకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

వేవ్స్-2025 ఫొటో బూత్ వద్ద యువత తమ ఇష్టమైన కార్టూన్, గేమింగ్, సినిమా పాత్రధారుల స్టిల్స్‌తో కూడిన ఫ్రేమ్‌లతో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో ఎస్‌పీఏ విజయవాడ డీన్ (స్టూడెంట్ అఫైర్స్) డాక్టర్ వెంకట కృష్ణకుమార్ సాహు, డీన్ (రీసెర్చ్) ప్రొఫెసర్ భానుచిత్ర, కేంద్ర కమ్యూనికేషన్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీ క్లాస్ భూముల అర్థం మార్చేశారే..!

(5వ పేజీ తరువాయి)

వ్యతిరేకించానన్నారు. అధికారులు సర్వే పరిశీలించారు. ఎస్సీ సొసైటీ భూములకు 200 మీటర్ల దూరంలోని కృష్ణానదీపాయలో సర్వే పాయింట్లను గుర్తించారు. ఈ సర్వే ఎస్సీ సొసైటీ పరిధిలో భూమి కాదని ఖరాఖండిగా చెప్పారు. ఇక్కడ గండ్ర ఇసుక తవ్వుకుంటూ తమ సొసైటీ భూముల్లోని బుసకను కూడా తవ్వే ప్లాన్ వేశారని అర్థమవుతోందన్నారు. ఇక్కడ ఇసుక తీశాక పంటలు పండించేందుకు అవకాశం ఉందని అగ్రికల్చర్ అధికారులు నివేదిక ఇవ్వాలని ఇదెలా సాధ్యమో అధికారులే చెప్పాలన్నారు. లక్షలు విలువ చేసే ఇసుకను బుసక పేరుతో కొల్లగొట్టేందుకు పెద్ద వ్యక్తులు పెద్ద స్కెచ్ వేశారని విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ పెద్దల అండతో అధికారులు అడ్డగోలుగా సర్వే చేశారని తెలుస్తోంది. వివిధ శాఖల అధికారుల నివేదికలు సమర్పించాక తవ్వకాలకు అనుమతులు వస్తాయి. తహసీల్దార్ ఎం కుసుమకుమారిని వివరణ కోరగా అర్జీ పెట్టింది సొసైటీ భూములకేనన్నారు. అయితే 40 ఎకరాలను తగ్గించి 11 ఎకరాలకే సర్వే చేశారన్నారు. సీ క్లాస్ భూముల్లో తవ్వకాలకు వీలుకాదని చెప్పానన్నారు.

పరేషన్!

(5వ పేజీ తరువాయి)

కార్డుదారులు వీటిని తినలేకపోతున్నారు. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లుల్లో ఆడించి, మినరల్స్ వంటివి కలిపి సార్టెక్స్ చేసి కార్డుదారులకు బియ్యాన్ని అందిస్తోంది. ఇటువంటి బియ్యం తినకపోవడానికి కారణమేమిటని కార్డుదారులను ప్రశ్నిస్తే ఈ బియ్యం లావుగా ఉంటాయని, గొంతు దిగటం లేదని, ముద్దగా అయిపోతోందని, కడుపు నొప్పి వస్తుందని ఇలా అనేక కారణాలు చెబుతున్నారు.

1318 రకం ధాన్యంతోనే ఇబ్బంది

రైతులు పండించే 1318 రకం ధాన్యం పేదలు తినడానికి పనికి రావడంలేదు. ఈ విషయాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు కూడా చెబుతున్నారు. ఈ రకం విత్తనం ఎక్కువ దిగుబడి ఇవ్వడంతో పాటు తుఫాన్ల సమయంలో తక్కువ నష్టాన్ని కలిగిస్తుంది. 1061 వంటి ఇతర రకాలు తినటానికి బాగుంటాయి. ఇలాంటి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయటం చాలా తక్కువగా ఉంటోంది. ప్రజలు తినటానికి పనికిరాని 1318 రకం బియ్యమే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. ఖరీఫ్, రబీ సీజన్లకు ముందే 1318 రకం ధాన్యం కొనుగోలు చేయబోమని స్పష్టంగా చెబితే రైతులు మరో రకం సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో లక్షకు పైగా బోగస్ కార్డులు!

ఎన్టీఆర్ జిల్లాలో 5,97,990 రేషన్‌కార్డులు, కృష్ణాజిల్లాలో 5,33,336 రేషన్ కార్డులు ఉన్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా జనాభాకు సరిసమానంగా కార్డులు ఉన్నాయి. ప్రతి సంక్షేమ పథకానికి, ఏదైనా ధ్రువీకరణ పత్రాలకు రేషన్ కార్డు తప్పనిసరి అవుతోంది. ఫ్యామిలీ గుర్తింపు కోసం రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దీంతో అందరూ రేషన్ కార్డులు పొందారు. వీటిలో లక్ష వరకు బోగస్ కార్డులు ఉన్నట్లు సమాచారం. ఈ బోగస్ రేషన్ కార్డుల కారణంగా కూడా రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ బియ్యాన్ని వారు తీసుకుని పని వాళ్లకో, బయటి వారికో ఇస్తున్నారు. వారు ఆ బియ్యాన్ని అమ్ముకుంటున్నారు. బోగస్ కార్డుల ఏరివేత ద్వారా మార్కెట్‌లో పక్కదారి పట్టే రేషన్ బియ్యంలో 10 నుంచి 15 శాతం వరకు అరికట్టడానికి వీలుంటుంది.

సన్నబియ్యంతో రేషన్ మాఫియాకు చెక్

ప్రభుత్వం కార్డుదారులకు సన్నబియ్యాన్ని అందిస్తే కార్డుదారులు వాటిని అమ్ముకోవటానికి ఇష్టపడరు. దీనివల్ల రేషన్ బియ్యం పక్కదారి పట్టడం అనేది ఉండదు. బయట కొనుగోలు చేసే సన్న బియ్యాన్నే ఇస్తున్నప్పుడు అమ్మటానికి అవకాశమే లేదు. దీంతో రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసే పరిస్థితి కూడా తగ్గిపోతుంది. ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది.

కార్డుదారునికి అదనపు భారం

కార్డుదారునికి కేజీ రూ.40 వ్యయం చేస్తూ ఉచితంగా 20 కేజీలు ఇస్తుంటే ఆ కార్డుదారుడు ఎండీయూ ఆపరేటర్‌కు కేజీ రూ. 10 చొప్పున మొత్తంగా రూ.200లకు అమ్ముకుంటున్నాడు. మరో రూ.1400 ఖర్చు పెట్టి రూ.1600లతో సన్నబియ్యం బస్తా కొంటున్నాడు. కార్డుదారుడి నెత్తిన రూ.1400 భారం పడుతోంది. అదే నాణ్యమైన సన్న బియ్యాన్ని ఉచితంగా కాకుండా కేజీ రూ.20 లకు విక్రయిస్తే.. కార్డుదారుని రూ.400 మాత్రమే ఖర్చు అవుతుంది. కార్డుదారునిపై పడుతున్న రూ.1400 భారంలో రూ.800 తగ్గుతుంది. ఉచితంగా ఇస్తూ రూ.1400 భారం మోపటం కన్నా రూ.20 నాణ్యమైన సన్నబియ్యం ఇస్తూ రూ.800 భారం తగ్గించడం మేలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉపాధి నిధుల్లో అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

చేసినట్టు గుట్టుచప్పుడు కాకుండా కంప్యూటర్‌లో నమోదు చేసి వారి బ్యాంకుఖాతాల్లో నగదును జమచేయించాడని ఆడిట్‌లో తేలింది. మూడేళ్ల క్రితమే మచిలీపట్నం మండలం నుంచి గూడూరు మండలానికి అతడిని పంపినా, వాడపాలెం పంచాయతీలో ఉపాధిహామీ పథకం పనులను తన చెప్పుచేతల్లోకి తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాడని వెల్లడైంది. ఈ ఏడాది రూ.1.05 లక్షల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయించినట్టు తేలిందది. ఆడిట్ అధికారులు పనులు చేసినవారి పేర్లు చదివి వినిపిస్తే, వీరెవరూ తమ గ్రామంలో ఉండటం లేదని, పనులు చేయలేదని గ్రామస్థులు తేల్చి చెప్పారు. ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్‌పై పూర్తిస్థాయి విచారణ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ అంశంపై సోమవారం మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.



రఘురామ కృష్ణరాజును సన్మానిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, అశోకగజపతిరాజు, గోకరాజు గంగరాజు

క్షత్రియులు రాజకీయంగా ఎదగాలి

- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

గుణదల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ సైతం క్షత్రియ సామాజిక వర్గానికి తగు ప్రాధాన్యత ఇస్తున్నారని, క్షత్రియ యువత రాజకీయంగా మరింత ఎదగాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. రామవరప్పాడులోని ఎస్ఎల్‌వి గ్రాండ్ క్రీడా ప్రాంగణంలో గడచిన రెండు రోజుల నుంచి ఫెడరేషన్ ఆఫ్ క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మహరాజా డాక్టర్ పి.వి.జి. రాజు క్రీడోత్సవ ముగింపు ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మాజీ మంత్రి అశోకగజపతి రాజు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, బీజేపీ ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్‌రాజు, కనుమూరు రఘురామ కృష్ణరాజులు అల్లూరి శీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.. క్షత్రియ యువత రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించే రోజులు వచ్చాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో క్షత్రియులు కీలక భూమిక పోషించాలని కోరారు. విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ, క్షత్రియ కార్పొరేషన్‌కు నిధులు సమకూర్చేలా కృషి చేస్తానని చెప్పారు. పలువురు అంతర్జాతీయ క్రీడాకారులకు సన్మానం చేశారు. అనంతరం బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌వి గ్రూప్ ఛైర్మన్ పెనుమత్స శ్రీనివాసరాజు, ఎ.పి.ఐ.ఐ.సి ఛైర్మన్ ఎం.రామరాజు, జి.రఘురామరాజు, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



క్వారీలో ఇసుక లోడింగ్ చేస్తున్న కార్మికులు

రొయ్యూర్యులో ఇసుక క్వారీ ప్రారంభం

తోట్లవల్లూరు : రొయ్యూర్యులో ఇసుక క్వారీని ఎట్టకేలకు ప్రారంభించారు. మూడురోజుల క్రితం ఎవరికి ఎలాంటి సమాచారం లేకుండా నిర్వాహకులు క్వారీలో తవ్వకాలు చేపట్టి స్టాక్‌పాయింట్‌లో ఇసుకను నిల్వ చేస్తున్నారు. ఈ నెల 13న 'ఇసుక క్వారీల ప్రారంభంపై సందిగ్ధం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం విదితమే. దాంతో కాంట్రాక్టరు రొయ్యూర్యు క్వారీని తెరిచారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	99,107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 585

దాసాంజనేయస్వామి ఆలయానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బాపులపాడు దాసాంజనేయ స్వామి ఆలయానికి అభయాంజనేయ స్వామి మాజీ పాలక మండలి వైస్ చైర్మన్ మేడేపూడి రామ్మోహన్‌రావు రూ.10 వేలు విరాళం ఆదివారం అందించారు. మనవడు అభయాంస్ జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరిలో నిర్వహించనున్న ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్క రించుకొని మనవడు పేరిట విరాళాన్ని ఆలయ అర్చకులు మారేపల్లి శ్రీనివాసాచార్యులకు అందజేశారు.



దాసాంజనేయస్వామి ఆలయ అర్చకులతో దాత మేడేపూడి రామ్మోహన్‌రావు కుటుంబ సభ్యులు

వైద్య సేవలు దూరం!

- చాలీచాలని రూముల్లో సేవలందిస్తున్న కేసరపల్లి ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది
- ప్రభుత్వ వైద్యం అందక పేదల అవస్థలు
- ఆక్రమణకు గురవుతున్న స్థలం
- కొత్త భవనం నిర్మించాలంటున్న గ్రామస్థులు



ఆరోగ్య ఉపకేంద్రం భవనం (ఫైల్)



ఉపకేంద్రం భవనం తొలగించాక పిచ్చి మొక్కలతో ఖాళీగా ఉన్న స్థలం

(గన్నవరం - ఆంధ్రజ్యోతి)

ప్రజలకు సేవలందించే ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరగా కూల్చివేశారు. ఏళ్ల గడుస్తున్నా పట్టించుకున్న వారే లేరు. గ్రామంలో ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది ఉన్నా కూర్చునేందుకు గూడు లేదు. వీరికి వసతి లేక అక్కడక్కడ ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. మందులు, వ్యాక్సిన్‌లు భద్రపరుచుకునేందుకు సరైన వసతి కరువై ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని కేసరపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సుమారు మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. గ్రామంలో రోడ్డు వెంబడి 24సెంట్లు ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేసేందుకు అప్పటి ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి గ్రామంలోని ప్రజలకు నలుగురు ఏఎన్ఎంలు ఒక హెల్త్ అసిస్టెంట్ వైద్య సేవలందిస్తూ రాగా ఇప్పుడు ఇద్దరు ఏఎన్ఎంలు ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పీలు పదిమంది ఆశా వర్కర్‌లు ఉన్నారు. గత 15ఏళ్ల క్రితం ఈ భవనం శిథిలావస్థకు చేరింది. అందులోనే కొన్నాళ్లు వైద్య సేవలందించారు. శ్లాబు, గోడలు పెచ్చులు ఊడి పడిపోవటంతో భయాందోళన చెంది వైద్య సిబ్బంది ఖాళీ చేశారు. అప్పటి నుంచి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలు, మహిళా మండలి భవనంలో వైద్య సేవలు గ్రామస్తులకు అందిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరిందని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాధుడే లేదని చెబుతున్నారు. ఆ స్థలం ఆర్‌అండ్‌బీ పేరున ఉండటం వలన నిధులు మంజూరు కావటం లేదని గతంలో వైద్య శాఖ అధికారులు చెప్పారు. స్థలాన్ని వైద్యశాఖకు రిజిస్ట్రేషన్ చేసిన చర్యలు లేవు. దీంతో ఎంఎల్ హెచ్‌పీలు సొంతంగా రూములు అద్దెకు తీసుకుని వైద్య సేవలందిస్తున్నారు. 24రకాల వైద్య పరీక్షలు చేయాల్సి ఉంది. పరీక్షల్లో తేలిన రోగాలకు మందులు కూడా ఇవ్వాలి. ఆ చాలీ చాలని గదుల్లో వచ్చిన రోగులకు సేవలందిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

24సెంట్లు ఉన్న స్థలం వైద్య సిబ్బంది ఖాళీ చేసి వెళ్లటంతో 8సెంట్లు ఆక్రమణలకు గురైందని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఇలానే ఉంటే ఉన్నది కూడా ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉందటున్నారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీన పరుచుకుని వైద్య శాఖకు అప్పగించాలని, ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ స్థలంలోనే నూతన భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విష్ణుపురం కాలనీ వాసులు

మౌలిక సౌకర్యాలు కల్పించాలి

కమిషనర్‌కు పోరంకి విష్ణుపురం కాలనీ వాసుల వినతి

పెనమలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాతికేళ్ల క్రితం నిర్మించిన పోరంకి విష్ణుపురం కాలనీలో శిథిలమైన రోడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థను బాగుచేయమని కోరుతూ కాలనీ వాసులు శనివారం కాలనీ నుంచి నిరసనగా ర్యాలీ నిర్వహించి మునిసిపల్ కమిషనరు భవానీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరితో విసిగిపోయిన కాలనీకి చెందిన సీనియర్ సిటిజెన్స్ నినాదాలు చేస్తూ మునిసిపల్ కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. గడచిన వర్షాకాలం అంతా వాననీళ్లు, మురుగునీళ్లు కలిసిపోయిన మీదట నడవలేక నానా ఇబ్బందులు పడ్డామని, అనేక మంది విష పురుగుల కాట్లకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు నరసింహరావు, కార్యదర్శి చిగురుపాటి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు వసంతరావు, సీపీఎం నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి

ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్లను కోరిన మెట్ట ప్రాంత రైతులు



ఆళ్ల గోపాలకృష్ణను అభినందిస్తున్న మల్లవల్లి టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మేజర్ కాలువ ద్వారా దిగువన ఉన్న మెట్ట ప్రాంతాల్లో సాగునీటి కొరత రాకుండా, నాగార్జునసాగర్ ఎడమ కాలువ చివరి ప్రాంతాలకు సకాలంలో సాగునీరందించేలా కృషి చేయాలని ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణను మల్లవల్లి టీడీపీ నాయకులు కోరారు. రంగన్నగూడెంలోని ఆళ్ల గోపాలకృష్ణను ఆదివారం కలిసిన మల్లవల్లి రైతులు, టీడీపీ నాయకులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైనందుకు శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యనమదల వెంకయ్యారావు, అక్కినేని ధర్మరాజు, షేక్ జాన్‌బాషా, అక్కినేని కృష్ణాజీ, తూము కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న ఏజీఅండ్ ఎస్‌జీ ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు సాయం

ఉయ్యూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ రూ. 20వేల ఆర్థికసాయం ఆదివారం అందచేసింది. పట్టణంలో పలు చోట్ల సీసీ కెమెరాలు అవసరం కాగా వాటి ఏర్పాటుకు అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు సహాయం అందించాలన్న పోలీసుల సూచన మేరకు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు, గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, బాపిరాజు తదితరులు అసోసియేషన్ తరపున ముందుకు వచ్చి పట్టణ ఎస్సై విశ్వనాథ్ సూచించిన టెక్నీషియన్‌కు ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బ్రహ్మేశ్వరరావు, భానుప్రకాశ్, కూనపరెడ్డి శ్రీనివాసరావు, వూర కిషోర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి ఒకరి మృతి

మృతుడి బంధువుల ఆందోళన

ప్రసాదంపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఓ ప్రముఖ హాస్పిటల్‌లో వైద్యం వికటించి ఆగిరిపల్లి మండలం వడ్లమానుకు చెందిన రెడ్డి వెంకటేశ్వర రావు (49) మృతి చెందాడని కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్ద ఆదివారం ఆందోళన చేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వ రరావును ఈ నెల 15న హాస్పిటల్‌లో చేర్పిం చామని, 21న డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారని, కానీ తాము సోమవారం డిశ్చార్జ్ చేయమని కోరామన్నారు. రోగికి ఇవ్వాల్సిన ఇంజెక్షన్ వేరేది ఇవ్వడం వల్లే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పటమట పోలీసులు సర్ది చెప్పారు.

రెడ్ వలంటీర్స్ శ్రమదానం

గన్నవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కులనెక్కలం లే అవుట్‌లో పుచ్చలపల్లి సుందరయ్య రెడ్ వాలంటీర్స్ శ్రమదానం చేశారు. లే అవుట్‌లోని పిచ్చి మొక్కలను, కంచెను తొలగించారు. బ్రహ్మచారి కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి అంజనేయులు, ఏసుదాస్, కోటయ్య, నాగేశ్వరరావు, నాగరాజు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

భూమి రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించాలి

సీఎం చంద్రబాబుకు టీడీపీ నేత ఫణికుమార్ వినతి

ఉయ్యూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి హనుమాన్‌నగర్‌లో నిలిచిన భూమి రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందచేసినట్టు టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ రాజులపాటి ఫణికుమార్ తెలిపారు. కాటూరు రోడ్డులోని హనుమాన్ నగర్‌లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తూ పట్టాలు కలిగి ఉన్నప్పటికి భూమి రిజిస్ట్రేషన్ నిలిపివేశారని, దీంతో అవసరానికి భూమి, ఇళ్లు అమ్ముకునే అవకాశం లేక స్థానికులు ఇబ్బంది పడుతున్న వైనాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ద్వారా ఇటీవల ముఖ్యమంత్రిని కలసి వినతిపత్రం అందచేయగా సమస్య పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

పెనమలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోంది. ఆదివారం యనమలకుదురులో టీడీపీ నాయకులు మొక్కపాటి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగింది. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అధిక సంఖ్యలో స్థానికులు హాజరై సభ్యత్వాలను నమోదు చేయించుకొన్నట్లు శ్రీనివాస్ తెలిపారు. పాత సభ్యత్వాలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, కొండ, సుబ్బు, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, బెజవాడ శివ తదితరులు పాల్గొన్నారు.





యనమలకుదురులో టీడీపీ సభ్యత్వ నమోదులో మొక్కపాటి శ్రీనివాస్.. ఆరుగొలనులో..

ఆరుగొలనులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఆరుగొలను టీడీపీ గ్రామ కమిటీ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు బేతా శేషుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా బలపడేందుకు స్వావలంబనకు కృషి చేసింది టీడీపీయేనన్నారు. 100 రూపాయల సభ్యత్వంతో 5లక్షల విలువైన బీమా సౌకర్యం కల్పించడంతో పాటు అత్యవసర సమయాల్లో కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలచేలా నమోదు కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్బా శంకరం, మద్దాల వెంకటేశ్వరరావు, కోట ప్రమీలారాణి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లి బాబూ జగ్జీవన్‌రాం నగర్‌లో

గన్నవరం : టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. మండలంలోని కేసరపల్లి బాబూ జగ్జీవన్‌రాం నగర్‌లో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బసవరావు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం పొందిన వారికి రూ.5లక్షలు ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. కార్యకర్తల సంక్షేమానికి యువనేత, మంత్రి నారా లోకేష్ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీసెల్ మండల ప్రధాన కార్యదర్శి కొడాలి రాజేష్, టీడీపీ అధ్యక్షుడు పలగాని బాలకృష్ణ, నాయకులు జంపన బుజ్జి, కొడాలి వరప్రసాద్, న్యాయవాది జి.కోటయ్య పాల్గొన్నారు.



కేసరపల్లి బాబూ జగ్జీవన్‌రాం నగర్‌లో..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పేద విద్యార్థికి రూ.40 వేలు ఆర్థిక సాయం

గన్నవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీకేఆర్ కళాశాలలో 1994-97లో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని సావరగూడెం మామిడి తోటలో జరిగింది. తొలుత ఆ బ్యాచ్‌లో చదివి మృతి చెందిన ఇరువురుకు నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. 27ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని సందడి చేశారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కళాశాల ప్రాంగణం, తరగతి గదులను, ఆనాటి అధ్యాపకులను గుర్తు చేసుకున్నారు. గుండ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థికి మధిర రాము, రూ.13వేలు, కొమ్మినేని ప్రవీణ్ రూ.10వేలు ఇతర మిత్రులు కలపి రూ.40వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రతి ఏటా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి పేద విద్యార్థులకు తమ వంతు సాయం చేయాలని నిర్ణయించారు. పడమట రంగారావు(పీఆర్), కాటూరి వీరబాబు, పామర్తి నారాయణ, బండి నాగసాంబిరెడ్డి, కొండేటి శ్రీను పాల్గొన్నారు.



ఘనంగా చెరుకూరివారి ఆత్మీయ కలయిక

విజయవాడ : ప్రతి ఒక్కరూ స్వయంశక్తితో ఎదగాలని విష్ణు కెమికల్స్ అధినేత చెరుకూరి కృష్ణమూర్తి అన్నారు. చెరుకూరి వారి 55వ ఆత్మీయ కలయిక పెదకాకాని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెరుకూరి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. అనంతపురానికి చెందిన ఇంటర్ విద్యార్థిని చదువు నిమిత్తం రూ. 65,000 ఆర్థికసాయం అందజేశారు. సుమారు 500 మంది హాజరైన ఈ సమావేశానికి విష్ణు కెమికల్స్ అధినేత చెరుకూరి కృష్ణమూర్తి, శ్రీ బిల్డర్స్ అధినేత సతీష్‌బాబు, చెరుకూరి లెనిన్ ఆర్చరీ అకాడమీ అధినేత సత్యనారాయణ, సీతారామయ్య, జగదీష్, చంద్రశేఖర్ రాజేశ్ తదితరులు హాజరయ్యారు.

రూ. 3.85 కోట్లతో అభివృద్ధి పనులు



సాయిపురంలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ షేక్ జాన్‌బాషా

ఉయ్యూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సాయిపురంలో రూ. 3.85 కోట్ల వివిధ నిధులతో రోడ్ల అభివృద్ధి పనులు జరుతున్నాయి. గ్రామంలో అంతర్గత రోడ్లతో పాటు గ్రామానికి వచ్చే మద్రివాడ- సాయిపురం, ముదునూరు- సాయిపురం, ఎగినపాడు- సాయిపురం ఆర్ అండ్ బీ జిల్లా పరిషత్ రోడ్లు గుంత లతో అధ్వానస్థితికి చేరు కుని ద్విచక్రవాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేక గ్రామ ప్రజలు అసౌకర్యానికి గురవుతున్న వైనాన్ని గత ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకున్నవారు లేక ఇబ్బంది పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల దుస్థితిని సర్పంచ్ జాన్‌బాషా, ఇతర నాయకులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలియపరచి రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు.

విజయభూషణ్‌కుమార్‌కు సత్కారం



జాస్తి విజయభూషణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ సీఎల్ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్‌ను విజయవాడలో జరిగిన సభలో డాక్టర్ సీఎల్ వెంకట్రావు, అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు వేమూరి బాబూరావు, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావులు ఆదివారం ఘనంగా సత్కరించారు. గన్నవరంలో సీనియర్ సిటీజన్స్‌కు విశిష్ట సేవలందించినందుకు తగిన గుర్తింపు లభించిందని జాస్తి తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న కాసన్నేని సత్య ప్రసాద్

గన్నవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ తల్లి ఆలయ సేవా సదన్ నిర్మాణానికి స్వచ్ఛందంగా భక్తులు విరాళాలు అందజేయటం అభినందనీయమని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ అన్నారు. పాత గన్నవరంలోని తిరుపతమ్మ తల్లి ఆలయ సేవా సదన్ నిర్మాణానికి యూఎస్ఏకు చెందిన చలసాని జితేంద్ర, ప్రశాంతి దంపతులు రూ.లక్ష, హైదరాబాద్‌కు చెందిన కాసన్నేని సత్యన్నారాయణ ప్రసాద్, స్వాతి దంపతులు రూ.50వేలు విరాళాన్ని ఆదివారం అందజేశారు. కాసన్నేని నాని, జాస్తి ఫణిశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ఆర్థికసాయం

ఉయ్యూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పమాల ధరించి శబరిమల వెళ్తున్న ఐదుగురు భక్తులకు ఖర్చుల నిమిత్తం బొమ్మారెడ్డి వెంకటరెడ్డి రూ. 25వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. బీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున అందజేశారు. బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్, సెక్రటరీ సుబ్బారెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఆరేపల్లి రమేశ్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	99, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

సెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.585

వైద్య కళాశాలలో క్రిటికల్ కేర్ యూనిట్

● రూ.23.75 కోట్లు మంజూరు చేసిన జాతీయ వైద్య మిషన్: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం వైద్య కళాశాలకు అన్ని హంగులు సమకూరుస్తున్నామని, క్రిటికల్ కేర్ యూనిట్ నెలకొల్పేందుకు జాతీయ వైద్య మిషన్ రూ.23.75 కోట్లు మంజూరు చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్యకళాశాల అభివృద్ధిపై చర్చించారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసే క్రిటికల్ కేర్ బ్లాక్ ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ద్వారకా తిరుమలలో మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

కాలినడకన ద్వారకా తిరుమలకు

● వెనిగండ్ల రాము ఎమ్మెల్యేగా గెలవడంతో మొక్కు చెల్లించిన టీడీపీ నాయకులు

గుడ్లవల్లేరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుడివాడ ఎమ్మెల్యేగా వెనిగండ్ల రాము అఖండ మెజారిటీతో గెలిస్తే ద్వారకా తిరుమలకు కాలినడకన వస్తానని మొక్కుకున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు కొడాలి రామరాజు కోరిక నెరవేరడంతో ఆదివారం రాత్రి వేంకటేశ్వరస్వామికి మొక్కు చెల్లించారు. తన స్వగ్రామం కుచికాయిలపూడిలో రామాలయం నుంచి ద్వారకాతిరుమలకు తన సన్నిహితులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం ఆయన పాదయాత్ర మొదలుపెట్టారు. ఆదివారం రాత్రికి వారంతా ద్వారకా తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం రాత్రి ద్వారకాతిరుమలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెళ్లారు. రామరాజు, అతని కుటుంబసభ్యులు, పాదయాత్ర చేసిన వారితో కలిసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రతినిధులు ఎమ్మెల్యేను సత్కరించి స్వామి ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు. పాదయాత్ర చేసిన వారిలో అడుసుమిల్లి దీపక్, సొంటి నాగేశ్వరరావు, చల్లపల్లి నాగరాజు, చిలుముల కొండ, బొర్రా ప్రసాద్, మసిముక్కు గోవర్ధన్, కలపాల నగరాజు, ఆలూరి వెంకటేశ్వరరావు, పాగోలు రవి, శంకర్, దొండపాటి నవీన్, పొన్నూరి సతీష్, చీలి హనుమంతు, పడమటి సత్యం, మట్టా వెంకటశ్వరరావు, చల్లపల్లి శివశంకర్ తదితరులు ఉన్నారు.

అక్షయపాత్ర సేవలు నిరుపమానం

గుడివాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజానికి అక్షయపాత్ర ఫౌండేషన్ అందిస్తున్న సేవలు నిరుపమానమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళగిరిలోని అక్షయ పాత్ర ఫౌండేషన్ కేంద్రంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఆహార పదార్థాల తయారీ యంత్రాల పనితీరును పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీ విధానాన్ని అక్షయపాత్ర ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని, అన్న క్యాంటీన్ల ద్వారా లక్షలాది పేదలకు ఆహారాన్ని నిత్యం సమయానికి అందించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే వారికి హామీ యిచ్చారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు గోకులక్షేత్రం ఫోటో ఫ్రేమ్ జ్ఞాపికను అందజేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆంధ్ర రీజినల్ అధ్యక్షుడు వంశీధరదాస్, అన్న క్యాంటీన్ పీఆర్ ప్రతినిధి రఘునందన్‌దాస్, అక్షయ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మంగళగిరిలో అక్షయపాత్ర వంటశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



చిన్నయసూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో బాలాజీ

తెలుగు భాషాభివృద్ధికి చిన్నయసూరి విశేష కృషి

గుడివాడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బాలవ్యాకరణం, నీతి చంద్రికలు రచించి తెలుగు భాషాభివృద్ధికి చిన్నయసూరి విశేష కృషి చేశారని మండల విద్యాశాఖాధికారి బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో పరవస్తు చిన్నయసూరి 218వ జయంతి వేడుకలను నిర్వహించారు. చిన్నయసూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషకు వ్యాకరణం తప్పనిసరి అని, సమాజంలో బాల్యం నుంచే నైతిక విలువల బోధనకు చిన్నయసూరి రచించిన బాలవ్యాకరణం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నందివాడ మండలం రుద్రపాక జిల్లా ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు పోలుకొండ నాగరాజకుమారికి చిన్నయసూరి సాహితీ పురస్కారం-2024 అందజేశారు. దొడ్డపనేని శేషగిరిరావు, తెలుగు భాషా వికాససమితి సమన్వయకర్త ప్రసాద్, సాహితీ స్రవంతి కన్వీనర్ లంకా సురేంద్ర పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

● డీసీసీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ డిమాండ్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మచిలీపట్నంలోని డీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భారత ప్రజాస్వామ్య అత్యున్నత వేదిక అయిన రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈతరహా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. అంబేద్కర్ ఒక వర్గానికో, ఒక కులానికో, ఒక ప్రాంతానికో చెందిన వారు కాదన్నారు.

సొర్లగొందిలో వివాహిత ఆత్మహత్య

నాగాయలంక, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సొర్లగొంది గ్రామానికి చెందిన వనమాల సావిత్రి (28) శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతిచెందింది. పదేళ్లక్రితం సావిత్రికి మహాలక్ష్మయ్యతో వివాహమైంది. ఆమెకు పిల్లలు పుట్టలేదు. భర్త, అత్త, బావ వేధిస్తుండడంతో తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు.



మంటాడలో ఆర్ అండ్ బీ రోడ్డు పక్కన చెత్తకుప్ప

రోడ్ల పక్కన చెత్తకుప్పలు

● దుర్గంధం వెదజల్లడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి-పమిడిముక్కల): మంటాడ, తాడంకి గ్రామాల పరిధిలో ఆర్ అండ్ బీ రోడ్ల పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. మంటాడలో ప్రధాన రహదారితో పాటు రెడ్డిపాలెం వద్ద, తాడంకిలో బీసీ కాలనీ సమీపాన ప్రధాన రహదారుల పక్కన చెత్తకుప్పలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ఆ మార్గాల్లో ప్రయాణిస్తున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు శుభ్రపరిచి, అక్కడ వచ్చిన చెత్త తీసుకొచ్చి ప్రధాన రహదారుల పక్కన గుట్టలుగా పోస్తున్నారు. గాలికి చెత్తలేచి రోడ్డుపై వెళ్లేవారిపైన పడుతోంది. కొన్నిచోట్ల పేరుకుపోయిన చెత్తకుప్పలకు నిప్పుపెడుతుంటే రోడ్డంతా పొగకమ్ముకుని వాహనాలు నడిపేవారు ఇబ్బంది పడుతున్నారు. చెత్తకుప్పలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



తాడంకిలో రోడ్డు పక్కన చెత్తకుప్ప

సెమీక్రిస్మస్ వేడుకలు

గుడివాడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యావికాస్ పాఠశాల ఆవరణలో బ్లూమ్స్, ప్రైమరీ, ఉన్నత పాఠశాల చిన్నారుల సమక్షంలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు ముప్పాళ్ల సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పాఠశాల ప్రైమరీ ప్రధానోపాధ్యాయుడు ఆశీర్వాదం వాక్యాన్ని వివరించారు. విద్యార్థులు క్రైస్తవ గీతాలకు నృత్యాలు చేవారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని ప్రదర్శించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యావికాస్ పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రేస్ ఇమ్మానియేల్ చర్చిలో..

గుడివాడ రూరల్: మల్లాయిపాలెం గ్రామ శివారు శ్రీకాళహస్తి కాలనీలో గ్రేస్ ఇమ్మానియేల్ చర్చిలో ఆదివారం పాస్టర్ వేశపోగు విజయబాబు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులు దేవరపల్లి విజయ్‌బాబు, మురళి, పిచ్చయ్య క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్యాండిల్స్ వెలిగించారు. క్రైస్తవులకు నూతన వస్త్రాలను బహుకరించారు. చిన్నారులు క్రీస్తు జననంపై నాటికలు ప్రదర్శించారు. దైవసేవకులు సెంద్రపాటి జోసఫ్, పాస్టర్ జాకోబ్, జాక్ బ్రెంట్‌రాయ్, కొమ్మల బబ్బు, వినుకొండ వరకుమార్, కాలేబు పాల్గొన్నారు.



గ్రేస్ ఇమ్మానియేల్ చర్చిలో క్రైస్తవులకు నూతనవస్త్రాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అధ్వానంగా ఉయ్యమ్మగుంట

● అభివృద్ధి చేయాలని గ్రామస్థులు వేడుకోలు

(ఆంధ్రజ్యోతి-పెదపారుపూడి): పెదపారుపూడి గ్రామంలో దళితవాడ శ్మశానవాటిక సమీపంలో అర ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఉయ్యమ్మ గుంట గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వానంగా ఉంది. చుట్టుపక్కల వారంతా చెత్త అక్కడే వేస్తున్నారని, రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు అంటున్నారు. గుంటను అభివృద్ధి చేస్తే దళితులు మరణిస్తే స్నానాలు చేయడానికి, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నీటి సదుపాయానికి, పశువులకు తాగునీటికి, భూగర్భ జలాల పరిరక్షణకు ఉపయోగపడుతుందని స్థానికులు అంటున్నారు. ఉయ్యమ్మగుంటను సర్వే చేసి తవ్వించి చుట్టూ పటిష్ఠమైన గట్టు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేస్తే చేపల చెరువుగానూ గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతుందని గ్రామస్థులు అంటున్నారు.



పెదపారుపూడి దళితవాడ శ్మశానవాటిక సమీపంలో గుర్రపుడెక్క, చెత్త, చెదారంతో నిండిపోయిన ఉయ్యమ్మగుంట

చెత్త వేస్తున్నారు

చుట్టుపక్కల వాళ్లంతా చెత్త, చెదారం తెచ్చి ఉయ్యమ్మ గుంటలో వేస్తున్నారు. దీంతో రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి చెత్త వేయకుండా చూడాలి.

-బండి వసంతం, గ్రామస్థురాలు





కట్ట ఏర్పాటు చేయాలి

ఉయ్యమ్మ గుంటను అభివృద్ధి చేస్తే పశువులకు తాగునీరు దొరుకుతుంది. గ్రామస్థులకు అన్ని విధాలుగా ఉపయోగపడుతుంది. అధికారులు ఉయ్యమ్మ గుంటకు కట్ట ఏర్పాటు చేయాలి.

- రేమల్లి వెంకటేశ్వరరావు, గ్రామస్థుడు



పైడమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

అంబరాన్నంటిన పైడమ్మ సంబరం

తొమ్మిదోరోజు పోటెత్తిన భక్తులు ● కోలాహలంగా శిడిబండ్ల ఊరేగింపు

పెడన, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పైడమ్మ సంబరం ఆదివారం అంబరాన్నంటింది. తొమ్మిదో రోజు అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రం కావడం, ఆదివారం కలిసిరావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. వేలాది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వెళ్లే దారులు, పెడన పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ ఈవో టి.వి.వి.మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. దక్షిణతెలుగుపాలెం శిడిబండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు, తీన్మార్ వాయిద్యాలు, కోలాట నృత్యప్రదర్శనలు, వీరంగ విన్యాసాల నడుమ కన్నుల పండుగగా ఊరేగింపు సాగింది. సోమవారం రాత్రి ఆలయం వెనుక పైడమ్మ చెరువులో అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

టమాటా లోడు లారీ పల్టీ

చల్లపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టమాటా లోడుతో వెళుతున్న మినీ లారీ టైరు పేలడంతో చల్లపల్లిలో జాతీయ రహదారిపై పల్టీకొట్టింది. గంగులవారిపాలెం సమీపంలో హైవేపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. టమాటా లోడు లారీ అనంతపురం నుంచి భీమవరం వెళుతోంది. లారీ పల్టీకొట్టడంతో టమాటా ట్రేలన్నీ రోడ్డుపై పడిపోయాయి. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా హైవే పెట్రోలింగ్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. టమాటా ట్రేలను తిరిగి లోడు చేసుకుని, చెల్లాచెదురైన కొంత లోడును మాత్రం అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. స్థానికులు ట్రేలు తీసుకొచ్చి పడిఉన్న టమాటాలు తీసుకెళ్లారు.



కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ నేత రొండి కృష్ణ, జనసేన నాయకులు గడ్డం రాజు, మాదివాడ రాము

జిల్లాలో డ్రెయిన్లు, పంట కాల్వల తవ్వకాలకు ప్రాధాన్యం

● కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు

మచిలీపట్నంటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'మునుపటి వైసీపీ ప్రభుత్వం డ్రెయిన్లు, సాగునీటి కాలువలను తవ్వకపోవడంతో కొద్దిపాటి వర్షానికే పొలాలు ముంపు బారినపడుతున్నాయి. జిల్లాలో డ్రెయిన్లు, సాగునీటి కాలువల తవ్వకాలకు ప్రాధాన్యం ఇస్తాం.' అని కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బందరులో ఆదివారం జనసేన, టీడీపీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల సమయంలో డ్రెయిన్లలో తూటుకాడ, గుర్రపుడెక్క దట్టంగా ఉండటంతో పంట భూములు ముంపు బారినపడ్డాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని దేవనబోయిన అన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రైతులు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. దేవనబోయిన వెంకటేశ్వరరావు సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారని టీడీపీ నాయకుడు రొండికృష్ణయాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు శాయన శివయ్య, దాసరి సాయిరాం, నల్లమోతు చంద్రమోహన్, చలమలశెట్టి వెంకట రమణ, జనసేన నాయకులు మాదివాడ రాము, గడ్డం రాజు, పినిశెట్టి వేణు, వంపుగడల చౌదరి, కర్రి మహేష్, తిరుమలశెట్టి రాజు, పామర్తి రాజేష్, గరికపాటి శివ, పినిశెట్టి కుమారి తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	99, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.585

మంత్రి రవీంద్రకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు పరామర్శ



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మంత్రి కొల్లు రవీంద్రను ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎస్.ఈశ్వరరావు ఆదివారం కలిశారు. సోదరుడిని కోల్పోన రవీంద్రను ఆయన పరామర్శించారు కొల్లు వెంకటరమణ అకాల మృతికి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



మంత్రి కొల్లు రవీంద్రను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆశాలత

వైద్య కళాశాలలో క్రిటికల్ కేర్ యూనిట్

• రూ.23.75 కోట్లు మంజూరు : మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం వైద్య కళాశాలకు అన్ని హంగులు సమకూరుస్తున్నామని, క్రిటికల్ కేర్ యూనిట్ నెలకొల్పేందుకు జాతీయ వైద్య మిషన్ రూ.23.75 కోట్లు మంజూరు చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్యకళాశాల అభివృద్ధిపై చర్చించారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసే క్రిటికల్ కేర్ బ్లాక్ ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆంధ్రా లయోలా కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ తుమ్మల శ్రీకుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ డీఆర్కే ప్రసాద్ దంపతులు

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

చల్లపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే ప్రపంచాన్ని శాసించగలమని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాల ఫిజిక్స్ అధ్యాపకులు, కెరీర్ గైడెన్స్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ అన్నారు. విజయా అకాడమీలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆదివారం ఆయన ఉపన్యసించారు. సృజనాత్మకత ఉన్న వ్యక్తులే ప్రపంచాన్ని శాసించగలరన్నారు. భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంచుకోవటం వల్ల ఉద్యోగ అవకాశాలు సాధించగల్గుతారన్నారు. పాజిటివ్ థింకింగ్ అలవరుచుకోవాలనీ, సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. శ్రీకుమార్‌ను ఘనంగా సన్మానించారు. విజయా అకాడమీ ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



చేపలు, రొయ్యలతో పచ్చడి, మురుగుల తయారీని వివరిస్తున్న కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త యశ్వంత్‌కుమార్

చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తులు

నాగాయలంక, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న చేపలు, రొయ్యలు విలువ ఆధారిత ఉత్పత్తుల శిక్షణ ఆదివారం నాలుగో రోజుకి చేరింది. చేపల పచ్చడి, చేపల మురుగులు తయారీ విధానాన్ని శాస్త్రవేత్త డాక్టర్ యశ్వంత్ కుమార్ మహిళలకు చేసి చూపించారు ఆశ్రిత రొయ్యలతో పలు పదార్థాల తయారీని చేసి చూపించారు. తొలుత చేపలు, రొయ్యలలో లభించే పోషకాలను శాస్త్రవేత్తలు వివరించారు. మత్స్యకార సంఘాల నేతలు లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు పరిశీలించారు. మత్స్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీనియర్ సిటీజన్ చండిక గంగాజలరావు, న్యాయవాది యాళ్ల సోమశేఖర్‌లను సత్కరిస్తున్న ప్రముఖులు

బంటుమిల్లి సీనియర్ సిటిజన్స్‌కు సత్కారం

బంటుమిల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ సీటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రజోత్సవాన్ని పురస్కరించుకుని మండలానికి చెందిన పలువురు ప్రముఖులకు ఘనంగా సన్మానించారువిజయవాడ సిద్దార్థా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో బంటుమిల్లి తదితర ప్రాంతాలలో వృద్ధుల సంక్షేమం కోసం పాటు పడుతున్న సీనియర్ సిటీజన్స్ చండిక గంగా జలరావు, యాళ్ల సోమశేఖర్‌లను దుశ్శాలువాలతో సన్మానించి మెమోంటో అందజేశారు. ఎమెమ్మల్యే గద్దె రామ్మోహనరావు, ప్రముఖ వైద్యులు సి.ఎల్ వెంకట్రావు, కృష్ణా , గుంటూరు జిల్లాల ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ



చల్లపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిమ్మలతోటలోని అయ్యప్ప స్వామి క్షేత్రంలో అష్టమ వార్షిక మహాపడిపూజా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రి తొమ్మిదోరోజు మహాపడిపూజ వైభవంగా జరిపారు. బాలా జీ స్వామి భక్తబృందం అయ్యప్ప స్వరార్చన ఉత్సాహభరితంగా సాగింది. వందలాది మంది అయ్యప్పదీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకులు అన్నవరపు పాండురంగారావు గురుస్వామి, ఆలయ కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.





మంత్రి రవీంద్రను కలిసిన తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్లు, సత్కరిస్తున్న రౌండి కృష్ణ



ఇరాలిలో దేవనబోయినను సత్కరిస్తున్న కూటమి నేతలు

సాగునీటి సమస్య పరిష్కారానికి ఐక్య కృషి

• తూర్పు కృష్ణాడెల్టా పీసీ చైర్మన్, డీసీ చైర్మన్లకు మంత్రి రవీంద్ర సూచన

అవనిగడ్డ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాడెల్టాలో సాగునీటి సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పని చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. నియోజకవర్గ ప్రముఖులు శీలం అశ్విన్ కుమార్ నేతృత్వంలో కృష్ణాడెల్టా ప్రాజెక్టు చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన డీసీ చైర్మన్లు మంత్రి రవీంద్రను మచిలీపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, నాగాయలంక, చల్లపల్లి, శ్రీకాకుళం డీసీ ఛైర్మన్లు బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, నిడమానూరి దిలీప్ కుమార్, అయినపూడి భానుప్రకాష్‌లను రవీంద్ర ఘనంగా సత్కరించారు. శీలం అశ్విన్ కుమార్‌తోపాటు తుమ్మల చౌదరిబాబు, మెండు లక్ష్మణరావు, ముద్దినేని చంద్రరావు, తలశిల వెంకట నరసింహారావు, పూతబోయిన కరుణ కుమార్, జరుగు పోతురాజు, కొల్లి వెంకటేశ్వరరావు, దేవనబోయిన కేశవ నారాయణ, గుడివాక నరహరి పాల్గొన్నారు.

డ్రెయిన్లు, కాల్వలు బాగుచేస్తా : దేవనబోయిన

మచిలీపట్నంటౌన్ : ఉమ్మడి కృష్ణాజిల్లాలో డ్రెయిన్లు, సాగునీటి కాల్వల తవ్వకాలకు ప్రాధాన్యత కల్పిస్తామని తూర్పు కృష్ణాడె ల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మచిలీపట్నంలో ఆదివారం ఆయనను జనసేన, టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు రౌండికృష్ణయాదవ్ మాట్లాడుతూ, వెంకటేశ్వరరావు సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారన్నారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు శాయన శివయ్య, దాసరి సాయిరాం, నల్లమోతు చంద్రమోహన్, చలమలశెట్టి వెంకట రమణ, జనసేన నాయకులు మాదివాడ రాము, గడ్డం రాజు, పినిశెట్టి వేణు, వంపుగడల చౌదరి, కర్రి మహేష్, తిరుమలశెట్టి రాజు, పామర్తి రాజేష్, గరికపాటి శివ, పినిశెట్టి కుమారి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో సత్కారం

కోడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. రామకృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఇరాలి, రామకృష్ణాపురం, ఊటగుండం, బసవవానిపాలెం గ్రామాలలో దేవనబోయిన అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించి, ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రావ ఎగ్రామాన టపాసులు కాల్చి కేకులు కట్ చేసి వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు శీలం అశ్విన్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మర్రే గంగయ్య, కొండవీటి సునీత, కోట రాంబాబు, జరుగు పోతురాజు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, కడవకొల్లు శ్రీనివాసరావు, అద్దంకి పాండురంగారావు, గంజాల సురేందర్ రావు, బడే భావన్నారాయణ, ముద్దినేని చంద్రరావు, కొల్లి కోటేశ్వరరావు, పెద్ద ఎత్తున కూటమి నేతలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు మేలు : ఎమ్మెల్యే మండలి

చల్లపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నడకుదురులో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులతో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు మాత్రమే ధాన్యం విక్రయించాలనీ, రైతుసేవా కేంద్రం లో తేమ శాతమే ఫైనల్ అని తెలిపారు. మిల్లర్లు అధిక తేమశాతం చూపిస్తే అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి

ప్రభుత్వం రైతులకు ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే సొమ్ము చెల్లిస్తోందన్నారు. రైతులకు సంపూర్ణ న్యాయం చేయటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.

అంబరాన్నంటిన పైడమ్మ సంబరం

• తొమ్మిదోరోజు పోటెత్తిన భక్తులు

పెడన, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మ సంబరం ఆదివారం అంబరాన్నంటింది. తొమ్మిదో రోజు అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రం కావడం, ఆదివారం రావడంతో భక్తులు పో టెత్తారు. వేలాది మంది భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వెళ్లే దారులు, పెడన పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉత్సవ కమిటీ సభ్యులు క్యూలైన్లను పర్యవేక్షించారు. దక్షిణ తెలుగుపాలెం శిడిబండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు, తీన్మార్ వాయిద్యాలు, కోలాట నృత్య ప్రదర్శనలు, వీరంగ విన్యాసాల నడుమ కన్నుల పండుగగా సాగిన ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి తెప్పోత్సవం సోమవారం రాత్రి జరుగుతుంది. ఆలయం వెనుక పైడమ్మ చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు.



భక్తులతో కిక్కిరిసిన పైడమ్మ ఆలయం , దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

క్రీడా హబ్‌గా మచిలీపట్నం : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నాన్ని క్రీడాహబ్‌గా రూపొందిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆంధ్రజాతీయ కళాశాల క్రీడా ప్రాంగణంలో 68వ ఏపీఎస్‌ఈఎఫ్ అండర్–19 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని ప్రసంగించారు. గ్రీన్ స్టోన్ సిఎండి అప్పికట్ల అప్పారావు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఝాన్సీ, కొరెడ్ల సుశీల, ఎండి ఇలియాస్ పాషా, ఐపిసి కరుణకుమార్, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు హసీంబేగ్ పాల్గొన్నారు.

అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి : గొల్లు కృష్ణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ ఖండించారు. డీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భారత ప్రజాస్వామ్య అత్యున్నత వేదిక అయిన రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ తరహా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. అంబేడ్కర్ కేవలం ఒక వర్గానికో, ఒక కులానికో, ఒక ప్రాంతానికో చెందిన వారు కాదన్నారు. వెంటనే అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.



సెమీ క్రిస్మస్ సందేశమిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



ఆర్థిక సహాయాన్ని అందించిన విద్యార్థులతో ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్

క్రీస్తు ప్రేమమార్గంలో పయనించాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు ప్రేమసందేశాన్ని అందరికీ పంచుదామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

రాజుపేటలోని ది ఇమ్మానియేల్ గాస్పెల్ ఫెలోషిప్ చర్చిలో ఆదివారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో రవీంద్ర పాల్గొన్నారు. ఐపీసీ కరుణకుమార్, రెవ డాక్టర్ రాచర్ల జోయెల్ ప్రమోద్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, సునీత, మేరీ, జెరూషా, కొరెడ్ల సుశీల పాల్గొన్నారు.

ఐవీఎం సేవలు స్ఫూర్తిదాయకం

చల్లపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. పురిటిగడ్డ ఐవీఎం హోమ్‌లో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, సురేష్ అందిస్తున్న సేవల అభినందనీయమన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం 13 మందికి రూ.3.60 లక్షల ఆర్థికసహాయాన్ని అతిథుల చేతుల మీదుగా సురేష్ అందజేశారు. వస్త్రదానం చేశారు. ఇద్దరికి వీల్‌ఛైర్, ట్రై సైకిల్‌ను అందజేశారు. 110 మంది ఐవీఎం విద్యార్థులకు క్రిస్మస్ బహుమతులు ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ రాంబాబు, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నబీషెరీ, విశ్రాంత డీఎస్పీ కె.హరి రాజేంద్రబాబు, సంస్థ ప్రతినిధులు వేములపల్లి విజయ, రోజా, సోఫి, జి.ప్రసాద్, ఎన్.ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు సింహాద్రి కృష్ణారావు

అవనిగడ్డ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి కృష్ణారావు నేటితరం రాజకీయ నేతలకు ఆదర్శప్రాయుడని విరసం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. బందలాయి చెరువులో కృష్ణారావు సంస్మరణ సభ ప్రముఖ న్యాయవాది పరుచూరి రాఘవేంద్రరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. విరసం నేత సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ జీవితాంతం పేదల కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి సింహాద్రి కృష్ణారావు అన్నారు. ఆయన ఆశయాన్ని కొనసాగించటమే సింహాద్రి కృష్ణారావుకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.

పీడీఎం నాయకులు అరవింద్, భరద్వాజ్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కృష్ణ, ప్రగతి శీల కార్మిక సమాఖ్య నాయకులు మోషే, ప్రజా కళా మండలి నాయకుడు జె.కోటేశ్వరరావు, పరుచూరి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా కళామండలి కళాకారులు విప్లవ గీతాలతో ఆహూతులను ఉత్తేజపరిచారు.

వివాహిత ఆత్మహత్య

నాగాయలంక, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సొర్లగొంది గ్రామానికి చెందిన వనమాల సావిత్రి (28) శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పదేళ్ల క్రితం సావిత్రికి మహాలక్ష్మయ్యతో వివాహమైంది. ఆమెకు పిల్లలు పుట్టలేదు. భర్త, అత్త, బావ వేధిస్తుండడంతో తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

అవనిగడ్డ రూరల్ , డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జనవరి 5వ తేదీన గన్నవరంలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ వీహెచ్‌పీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, డాక్టర్ గిరి, తుంగల మురళీ, తోట శ్యామ్ కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టమాటా లోడు లారీ పల్టీ

చల్లపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : టమాటా లోడుతో వెళుతున్న మినీ లారీ టైరు పేలటంతో చల్లపల్లిలో జాతీయ రహదారిపై పల్టీకొట్టింది. గంగులవారిపాలెం సమీపంలో హైవేపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ సంఘటన చోటుచేసుకుంది. టమాటా లోడు వాహనం అనంతపురం నుంచి భీమవరం వెళుతోంది. లారీ పల్టీకొట్టడంతో టమాటా ట్రేలన్నీ రోడ్డుపై పడిపోయాయి. డ్రైవర్, క్లీనర్‌లకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా హైవే పెట్రోలింగ్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. టమాటా ట్రేలను తిరిగి లోడు చేసుకుని, చెల్లాచెదురైన కొంత లోడును మాత్రం వదిలేసి వెళ్లిపోయారు. స్థానికులు ట్రేలు తీసుకువచ్చి టమాటాలు తీసుకువెళ్లారు.